గిర్మాజీపేట: స్వీట్లు తినిపిస్తున్న కార్పొరేటర్ బాలిన సురేశ్, ఖిలావరంగల్: పడమరకోటలో కార్పొరేటర్ ఉమ ఆధ్వర్యంలో సంబురాల్లో పాల్గొన్న నాయకులు, కరీమాబాద్: శంభునిపేటలో వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

వరంగల్‌లో సంబురాలు

- **బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటనపై నియోజకవర్గవ్యాప్తంగా హర్షాతిరేకాలు**
- **సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం**
- **బీఆర్ఎస్ సర్కారుకు జై కొట్టిన పింఛన్‌దారులు**

ఖిలావరంగల్/గిర్మాజీపేట/కాశీబుగ్గ/కరీమాబాద్, అక్టోబర్ 15: బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రకటనపై ఆదివారం వరంగల్ తూర్పు నియోకజకవర్గంలో సంబురాలు అంబరాన్నంటాయి. సీఎం కేసీఆర్ మేనిఫెస్టోను విడుదల చేయడంతో సబ్బండ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ వేడుకలు జరుపుకున్నారు. వృద్ధులు, రైతులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వానికి జేజేలు పలికారు. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. గులాబీ రంగు చల్లుకొని డప్పువాయిద్యాలతో నృత్యాలు చేశారు. ముఖ్యంగా వృద్ధులతోపాటు ఒంటరి మహిళలు సీఎం కేసీఆర్‌కు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పలు డివిజన్లలో పటాకులు పేల్చి నినదించారు. మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని తేల్చి చెప్పారు. వరంగల్ 38వ డివిజన్ పడమర కోట అమరవీరుల స్తూపం వద్ద కార్పొరేటర్ బైరబోయిన ఉమ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. 37వ డివిజన్‌లో తూర్పుకోట హనుమాండ్ల జంక్షన్‌లో కార్పొరేటర్ వేల్పుగొండ సువర్ణ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. 35వ డివిజన్ శివనగర్‌లో కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో మహిళలు, పింఛన్‌దారులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. 34వ డివిజన్‌లో కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, డివిజన్ అధ్యక్షుడు పగడాల సతీశ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. 25, 26, 28, 33వ డివిజన్‌లో సంబురాలు అంబరాన్నంటాయి. మండిబజార్ సెంటర్‌లో బీఆర్ఎస్ నేత బస్వరాజు శ్రీమాన్, 26వ డివిజన్‌లో కార్పొరేటర్ బాలిన సురేశ్, 28, 33వ డివిజన్‌లో బీఆర్ఎస్ నేతలు స్వీట్లు తినిపించుకొని డ్యాన్స్ చేస్తూ హోరెత్తించారు. కాశీబుగ్గ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి పటాకులు కాల్చారు. 18వ డివిజన్ లేబర్‌కాలనీ నర్సంపేట్‌రోడ్డులో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు గడ్డమీది రాజేశ్ ఆధ్వర్యంలో నాయకులు సంబురాలు నిర్వహించారు. అండర్‌రైల్వేగేట్ ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

వరంగల్ చౌరస్తా: 36వ డివిజన్‌లో సంబురాల్లో పాల్గొన్న నాయకులు

వాడవాడలా వేడుకలు..

వరంగల్‌చౌరస్తా/పోచమ్మమైదాన్: సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేసిన సందర్భంగా 27, 36 డివిజన్‌లో పార్టీ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. 27 డివిజన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో నాయకులు రంగులు చల్లుకొని, మిఠాయిలు పంపిణీ చేశారు. 36వ డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు వేల్పుగొండ యాకయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన సంబురాల్లో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్ హాజరై మహిళా నాయకులు, కార్యకర్తలతో కలిసి నృత్యాలు చేశారు. పోచమ్మమైదాన్ సెంటర్‌లో 22వ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి కుంకుమ చల్లుకొని స్వీట్లు పంపిణీ చేశారు. కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, డివిజన్ ఇన్‌చార్జి మావురపు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. 12వ డివిజన్ దేశాయిపేటలోని పోచమ్మతల్లి ఆలయం సెంటర్ వద్ద కార్పొరేటర్ కావటి కవిత రాజుయాదవ్ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే నరేందర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్‌లో కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు యాకూబ్ పాల్గొన్నారు. 23వ డివిజన్ గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

పోచమ్మమైదాన్: పోచమ్మమైదాన్ సెంటర్‌లో, దేశాయిపేటలో కార్పొరేటర్ కావటి కవితకు స్వీట్ తినిపిస్తున్న మహిళలు, ఎంహెచ్‌నగర్‌లో.., గోపాలస్వామి గుడి జంక్షన్‌లో..

'దసరా ఉత్సవాలకు సదుపాయాలు కల్పించాలి'

కాశీబుగ్గ, అక్టోబర్ 15: చిన్నవడ్డేపల్లి చెరువు సమీపంలో నిర్వహించనున్న బతుకమ్మ, దసరా ఉత్సవాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కాశీబుగ్గ దసరా ఉత్సవ సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు ఆదివారం మేయర్ గుండు సుధారాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. మేయర్‌ను కలిసిన వారిలో మాజీ కార్పొరేటర్ ఓని భాస్కర్, బయ్యాస్వామి, ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్ తదిరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఏ జబ్బార్

'ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి'

కరీమాబాద్, అక్టోబర్ 15: ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ వక్ఫ్‌బోర్డు ఆదేశాలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని జానుల్లా షాహిద్ ఖబ్రస్తాన్, ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ కోరారు. ఎస్ఆర్ఆర్‌తోటలో ఆదివారం ఏర్పాటు సమావేశంలో జబ్బార్ మాట్లాడుతూ జానుల్లా షాహిద్ ఖబ్రస్తాన్‌కు వక్ఫ్‌బోర్డు కమిటీ వేసినా కొందరు ఆదేశాలను బేఖాతర్ చేస్తూ అభివృద్ధి పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో కమిటీల సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన అష్టావధానం

పోచమ్మమైదాన్, అక్టోబర్ 15: హనుమకొండ ఎక్సైజ్ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన అష్టావధానం అలరించింది. శ్రీలేఖ సాహితీ వరంగల్ ఆధ్వర్యంలో తిరుకోవలూరు శ్రీహర్షతో ఏర్పాటు చేసిన అష్టావధానం ఆకట్టుకుంది. ఇందులో సంయోజకులుగా డాక్టర్ దహగాం సాంబమూర్తి, పృచ్ఛకులుగా డాక్టర్ ఎన్‌వీఎన్‌చారి, వెంకటరమణమూర్తి, కొమ్మోజు శ్రీధర్, పల్లె నీను, గుంటి విష్ణుమూర్తి, కుందావఝ్ఝుల కృష్ణమూర్తి, డాక్టర్ బండారి సుజాత, డాక్టర్ పల్లేరు వీరస్వామి వ్యవహరించారు.

వరంగల్‌లో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

పోచమ్మమైదాన్/గిర్మాజీపేట, అక్టోబర్ 15: వరంగల్ డాక్టర్స్‌కాలనీ-1, గౌతమీనగర్‌లోని దత్తాత్రేయ సహిత లక్ష్మీగణపతి ఆలయంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 23 వరకు రోజూ ఉదయం 11 గంటలకు, సాయంత్రం 6.30 గంటలకు విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 19న లలితా సహస్రనామ పారాయణ సామూహిక కుంకుమార్చన, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. శ్రీనివాసకాలనీలోని శృంగేరి శంకరమఠంలో శారదా శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ప్రధాన అర్చకుడు సంగమేశ్వరజోషి ఆధ్వర్యంలో అర్చకులు గోపూజ, శారదాంబ అమ్మవారికి పూజలు చేశారు. చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం, సప్తశతి పారాయణం, సామూహిక లలిత పారాయణం జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. రామన్నపేట ఎస్‌వీఎన్‌రోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేశారు. ఈ నెల 20న మూలనక్షత్రం సందర్భంగా పిల్లలకు భగవద్గీత, నోట్‌బుక్స్ వితరణ ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు బ్రహ్మదేవర ఆనందరావు తెలిపారు. రామన్నపేట రామలింగేశ్వర ఆలయంలోని అమ్మవారిని అర్చకుడు తనుగుల రత్నాకర్‌రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గామాత

సనాతన సంప్రదాయ ఆచరణతో సర్వతోముఖాభివృద్ధి

పోచమ్మమైదాన్, అక్టోబర్ 15: ఆధునిక ప్రపంచంలో భారతదేశం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధి సాధించడానికి సనాతన సంప్రదాయం ఆచరణ ముఖ్యమని శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ అన్నారు. ములుగురోడ్డులోని సప్తధామంలో ఆదివారం జరిగిన భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహర్షులు బోధించిన అనేక గ్రంథాలు భగవద్గీత పురాణ ఇతిహాసాల వల్లే దేశ ఔన్నత్యంతోపాటు ప్రజలందరూ సుభిక్షం, సుఖ సంతోషాలతో ఉంటున్నారన్నారు. దేశంలో కులమతాలకతీతంగా సనాతన సంప్రదాయాన్ని ఆచరిస్తూ, ఇతర మతాలను గౌరవిస్తూ జీవిస్తున్నారన్నారు. దీన్ని భ్రష్టు పట్టించేందుకు చాలామంది చేసిన ప్రయత్నాలు వ్యర్థమయ్యాయని వివరించారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోక పఠనంలో విజేతలకు బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతలుగా పెద్ది ప్రభాకర్, వెంకటరమణ వ్యవహరించారు. 40 మంది పేదలకు బ్లాంకెట్లు, మరికొందరికి చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండారు సాయి నారాయణ, సోమా రామయ్య, వెంకటరమణ, గందె ఉమాశంకర్, లాయక్ అహ్మద్, భ్రమరాంబ, ప్రియాంక పాల్గొన్నారు.

విజేతలతో ట్రస్ట్ ప్రతినిధులు

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ రద్దు

ఖిలావరంగల్, అక్టోబర్ 15: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న గ్రీవెన్స్‌ను రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. అధికారులు ఎన్నికల విధుల్లో నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి ప్రజలు ఫిర్యాదులు అందించేందుకు రావొద్దని కోరారు.

బొడ్రాయి సన్నాహక సమావేశంలో పాల్గొన్న ఏకశిలానగర్ ప్రజలు

మేడారం జాతర తర్వాతే బొడ్రాయి పనులు

కరీమాబాద్, అక్టోబర్ 15: బొడ్రాయి ప్రతిష్ఠాపన సన్నాహక సమావేశం ఆదివారం ఏకశిలానగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, పెద్దలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పండుగలు, ఎన్నికలతోపాటు మేడారం మహాజాతర ఉన్నందుకు ప్రజల కోరిక మేరకు ఏకశిలానగర్‌లో మేడారం జాతర తర్వాతే బొడ్రాయి వేడుకలు చేపట్టాలని నిర్వాహకులు తీర్మానించినట్లు తెలిపారు.

ఆలిండియా ఎంప్లాయీస్ కబడ్డీ పోటీలకు పీఈటీ గోగు నారాయణ ఎంపిక

కరీమాబాద్, అక్టోబర్ 15: ఆలిండియా ఎంప్లాయీస్ కబడ్డీ పోటీలకు రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ గోగు నారాయణ ఎంపిక య్యారు. ఈ నెల 16 నుంచి జరుగనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి కబడ్డీ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర సివిల్ ఎంప్లాయీస్ పురుషుల కబడ్డీ జట్టు తరపున గోగు నారాయణ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలువురు గోగు నారాయణను అభినందించారు.